

ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధుల మంజూరు

పలాస: ఎన్నో దశాబ్దాలుగా సమస్యగా ఉన్న తాళభద్ర గేటు ఫ్లైఓవర్ నిర్మాణానికి రైల్వే అధికారులు నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రతిపాదన ఉందన్నారు. 2017-18లో అప్పటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50-50 శాతం నిధులుతో ఎలిసి గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం అంగీకరం తెలిపిందన్నారు. అప్పటి ప్రభుత్వంలో ఆర్థిక సమస్యల నేపథ్యంలో వంతెన పనులు ముందుకు సాగలేదన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం దీనిపై ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దీనిపై కదలిక తీసుకువచ్చామన్నారు. సిఎం చంద్రబాబు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి మరోమారు ప్రతిపాదనలు చేపట్టామన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో శతశాతం రైల్వే నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు అందాయని తెలిపారు.

నేడు నీట్ పరీక్ష



- నిర్వహణ బాధ్యతల్లో ఎన్‌టిఎ
- నాలుగు కేంద్రాల్లో పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా వ్యాప్తంగా 'నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్సు టెస్ట్' (నీట్) యుజి-2025 ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో నాలుగ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ బైపిసి చదివిన విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు పరీక్షకు అవసరమైన శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో చేరి వైద్య వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఈ పరీక్ష తప్పనిసరి. ఈ పరీక్షల్లో మార్కుల ఆధారంగా దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో సీట్లను సాధించడానికి ఈ ప్రవేశ పరీక్ష మార్కులే ఆధారం.

పరీక్ష విధానం ఇలా...

నీట్ ప్రవేశ పరీక్షలో భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రాల నుంచి ప్రతి సబ్జెక్టుకూ ఆబ్జెక్టివ్ విధానంలో 45 బహుళైశ్చిక ప్రశ్నలు ఉంటాయి. గతంలో ఛాయిస్ విధానంలో పరీక్ష ఉండేది. ఈ ఏడాది నుంచి ప్రతి ప్రశ్నకూ సమాధానం రాయడం తప్పనిసరి. ప్రతి ప్రశ్నకూ నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన యథాతథంగా కొనసాగిస్తున్నారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. ప్రతి సబ్జెక్టుకూ 180 చొప్పున నాలుగింటికి 720 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అడ్మిట్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఐడి కార్డు తప్పక పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇవీ...

పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రం వద్దే పెన్నులు ఇస్తారు. విద్యార్థులు జీన్స్ ఫ్యాంట్లు ధరించకూడదు. సాధారణ దుస్తుల్లోనే పరీక్షకు హాజరు కావాలి. తలకు టోపీలు, కళ్లజోడు (సన్ గ్లాసులు) పరీక్ష హాల్లో ఉపయోగించకూడదు. సెల్‌ఫోన్, కాలుక్యులేటరు, ఎలక్ట్రానిక్ వాచ్ వంటి పరికరాలను అనుమతించరు. విద్యార్థినులు ముక్కు పుడక, చెవులకు దుద్దులు, చేతులకు గాజులు, జడ రబ్బర్లతో సహా ఎలాంటి ఆభరణాలు ధరించకూడదు. ఎవరైనా ఇటువంటి వాటిని తమతో పాటు తీసుకొస్తే పరీక్షా కేంద్రాలకు చేరుకునే సమయంలో మందస్తుగా సిబ్బంది తనిఖీ చేసి వాటిని కేంద్రం వద్దే నిలువరిస్తారు.

పరీక్షల్లో టైం మేనేజ్‌మెంట్ తప్పనిసరి

సాధనతో ఉత్తమ ఫలితాలు సాదించడానికి సమయం అత్యంత కీలకం. ఒక ప్రశ్నకు ఒకే నిమిషంలో సమాధానం రాబట్టాల్సి ఉంటుంది. ఛాయిస్ విధానం లేదు కాబట్టి ప్రతి ప్రశ్నకూ జాగ్రత్తగా సమాధానం రాయాల్సి ఉంటుంది. కచ్చితత్వంతో జవాబులు రాసేలా జాగ్రత్తలు పాటించాలి.

పరీక్షా కేంద్రాలివే..

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, గుజరాతీపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎచ్చెర్లలోని ట్రిబుల్ ఐటి కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు రెండు వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి

ఈ ఏడాది జిల్లాలో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఎన్‌టిఎ నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. నీట్ నిబంధనలకు లోబడి విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఎక్కడా ఎటువంటి లోపాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వెబ్‌కాం పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష సమయాకి ముందే విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది.

-ఎం.వెంకటేశ్వరరావు, డిఆర్‌ఒ

ముగిసిన జీపుజాతా

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని, చివరి భూములకు నీరు అందించాలని రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన జీపుజాత శనివారంతో ముగిసింది. జిల్లాలో సోంపేట, కంచిలి, మందస, పలాస, నందిగాం, టెక్కలి మండలాల్లో సాగింది.

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని, చివరి భూములకు నీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యాన చేపట్టిన రెండో రోజు జీపుజాతా శనివారం సోంపేట చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో ఉండే ప్రధానమైన ప్రాజెక్టులన్నీ మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. మదుములు, షట్టర్లు సక్రమంగా లేకపోవ డంతో చివరి భూములకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ ఆధునీకరణకు రూ.1600 కోట్లు కేటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వంశధారను బహుదా నదితో అనుసంధానం చేస్తే ఇచ్ఛాపురం చివరి ఎకరా వరకూ సాగునీరు అందుతుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలకి ప్రసాదరావు, కె.సూరయ్య, జీడి రైతు సంఘం నాయకులు అజయ్‌కుమార్, కొబ్బరి రైతు సంఘం నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ, భాస్కరరావు, చంద్రరావు, ప్రసాదరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కప్ప గోపీనాథ్ పాల్గొన్నారు. ఇక్కడ నుంచి కంచిలి మండలం బూరగంకు చేరుకుంది. కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ కార్యదర్శి కాయ ఢిల్లీరావు, బుడ్డ చిన్నయ్య, బుడ్డ బైరి, రంగాల చిన్నయ్య పాల్గొన్నారు.



సోంపేట : మాట్లాడుతున్న మోహనరావు

మందస మండలం గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయరుగా చేస్తూ వచ్చిన నీటిని బాహుదా నదిపై ఉన్న 11 ఓపెన్ హెడ్‌చానల్స్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని, కాలువలకు షట్టర్లు బిగించి అన్నదాతలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు.

పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరును నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎపి రైతు సంఘం కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు అందించాలని చేపట్టిన జీపుజాతా పలాస చేరుకుంది. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రరావు, వి.ప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.భాస్కరరావు, వాసు పాల్గొన్నారు.

నందిగాం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జీపుజాతా నిర్వహించారు.

టెక్కలిలో నిర్వహించిన జీపుజాతా కార్యక్రమంలో నంబూరు షన్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, బగాది వాసుదేవరావు పాల్గొన్నారు.

212 ఐడి కేసులు నమోదు

శ్రీకాకుళం: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలల్లో 212 అనాదకారిక మద్యం (ఐడి) కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 162 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 2231 లీటర్ల నాటుసారా, ఏడు వాహనాలను స్వాధీపర్చుకున్నట్లు తెలిపారు. అలాగే పెద్దఎత్తున బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్న 874 మందిపై కేసులు నమోదు చేసి 1454.67 లీటర్ల మద్యం స్వాధీన పరచుకున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో శతశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు హాజరయ్యారు.

అట్టహాసంగా బీచ్ ఫెస్టివల్

- బారువ తీరంలో సందర్శకుల కోలాహలం
- ఆకట్టుకుంటున్న క్రీడలు, వాటర్ స్పోర్ట్స్
- గోవా తీరాన్ని తలపిస్తున్న పర్యాటక ఏర్పాట్లు
- క్రీడలను ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- సోంపేట

రాష్ట్రంలోనే విశాలమైన సముద్ర తీరం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందకపోవడంతో ఈతీరం మత్స్యకారుల వేట, అప్పుడప్పుడూ సముద్ర స్నానాలకు వచ్చి వెళ్లే సందర్శకులు మినహా ఎక్కడా ఎలాంటి సందర్శకుల తాకిడి కనిపించదు. కానీ, ఇప్పుడు పర్యాటకంగా తీరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలకు తగ్గట్టు బారువ కేంద్రంగా జిల్లా యంత్రాంగం రెండు రోజుల బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. అందులో భాగంగా తొలి రోజైన శనివారం వేలాదిగా తరలివచ్చిన సందర్శకులతో తీరం ఒక్కసారిగా కిక్కిరిసి పోయింది. ఉదయం సూర్యోదయం వేళ జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్‌లు తాబేలు పిల్లలను సముద్రంలోకి జార విడుస్తూ కార్యక్రమాలను ప్రారంబించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వివిధ జిల్లాల క్రీడాకారులు, స్థానికులతో కలిసి ఈ వేడుకలను చేపట్టారు. అలాగే క్రీడాకారులతో కలిసి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న జెసి, ట్రైనీ కలెక్టర్, శ్రీకాకుళం ఆర్‌డిఒ ఇతర అధికారులు మానసిక ఉల్లాసాన్ని నింపారు. ఉదయం 7 గంటల నుంచి బీచ్ వాలీబాల్, వాటర్ స్పోర్ట్స్ క్రీడలను ప్రారంబించారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన కయాకింగ్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడ్డారు. ఈ వేడుకల్లో వివిధ రుచులను ప్రదర్శంచారు. చిన్నారులు మొదలు పెద్దల వరకు వివిధ రుచులను ఆస్వదించారు. ఫుడ్‌స్టాల్స్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి, ట్రైనీ కలెక్టర్ పరిశీలించి రుచులను ఆస్వాదించారు. మొదటి రోజు వాటర్ స్పోర్ట్స్‌లో బాపట్ల, గుంటూరు, ఏలూరు, కర్నూలు, నంద్యాల, ఎన్‌టిఆర్, తిరుపతి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి కయాకింగ్‌లో తలపడ్డారు. 200 మీటర్లలో సి కయాకింగ్ (స్ప్రింట్ ఈవెంట్)లో సబ్ జూనియర్ బాలురు, సి కయాకింగ్ 200 మీటర్లలో సీనియర్ బాలురు క్రీడలను జెసి, ట్రైనీ కలెక్టర్, పలాస, టెక్కలి ఆర్‌డిఒలు వెంకటేష్, ఎం.కృష్ణమూర్తిలు జెండా ఊపి ప్రారంభించారు.



వాటర్ స్పోర్ట్స్ నిర్వాహకులు బలరాం నాయుడు పోటీలను పర్యవేక్షించారు. సాయంత్రం బీచ్‌లో సాహస క్రీడలను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, కలెక్టర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, జెసి, ట్రైనీ కలెక్టర్, ఆర్‌డిఒలతో కలిసి ప్రారంభించారు. ఎటివి ఆల్ టెరైన్ వెహికిల్ తీరంలో సందడి చేశాయి. ఈ వాహనాలను శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష నడుపుతూ ప్రత్యేక ఆకర్షణగా నలిచారు. ఆమెతో పాటు అక్కడికి హాజరైన చిన్నారులు, విద్యార్థినులు వాహనాన్ని నడుపుతూ కనిపించారు. రాత్రి వేళ నిర్వహించిన ఫైర్ అండ్ రింగ్ డ్యాన్స్, .రెజ్లింగ్ (కుస్తీ) పోటీలను ప్రారంభించిన కేంద్రమంత్రి ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేస్తూ ఆయన సందడి చేశారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన కిడ్స్ పార్క్ పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తీరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్స్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రెండో రోజు ఆదివారం సెలవు కావడంతో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. సందర్శకులు పెరిగితే వారికి తగ్గట్టు ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు చేపడున్నారు. జిల్లాలో బారువా తీరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



తీర ప్రాంత అభివృద్ధికి చర్యలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తీర ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రూ.16.80 కోట్లతో నిర్మించనున్న మండలంలోని తీర ప్రాంత గ్రామలైన బూర్జపాడు, డొంకూరు, బారువములపులం రోడ్డుపై కొండిరేవు డెక్కపై వంతెన నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంత వాసులకు ఎంతో అవసరమైన ఈ వంతెనలు శిథిలావస్థలో చేరారడంతో కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వంతెనల నిర్మాణం ద్వారా అనేక గ్రామాల మధ్య అనుసంధానం మెరుగవుతుందని, రవాణా సౌలభ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ ముఖ్యంగా మత్స్యకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, పండుగ కాలాల్లో రవాణా సమస్యలు తగ్గి, ఉత్పత్తులు మార్కెట్‌కు సులభంగా చేరతాయని పేర్కొన్నారు. దీని వల్ల గ్రామీణ ఆదాయ మార్గాలు మెరుగవుతాయని చెప్పారు. వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మని, ఈ వంతెనల పనులు వేగంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.అంతకుముందు తీర ప్రాంత గ్రామస్తులు, టిడిపి నాయకులు కేంద్రమంత్రికి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇఇ సనపల రామకృష్ణ, డిఇ జి.రవిబాబు, జెఇ ధనుంజయ్, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, దక్కత శ్రీను, సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, దున్న లోకేష్, సూర్యనారాయణ, దక్కత కామేశ్వరరావు, ఎంపిడిఒ రామారావు పాల్గొన్నారు.



కవిటి : పీడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అనిల్

కొబ్బరి అభివృద్ధికి సహకారం

డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

కవిటి: కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా మండలంలోని రైతుల ఆర్థిక బలోపేతానికి సహాయ సహకారాలు అందిస్తామని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. కవిటిలో నూతనంగా నిర్మించిన సమీకృత వ్యవసాయ కేంద్రాన్ని(క్లస్టర్ సెంటర్) శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ఉత్పత్తులు తామే విక్రయించుకుని ఆర్థిక స్వావలంబన సాధించేలా కృషి చేయాలని సూచించారు. కొబ్బరి కాయలు, కొబ్బరి పుల్లలు సంస్థ ద్వారా సొంతంగా విక్రయిస్తే వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు ఆరింగి అనిల్ కుమార్ స్థానికంగా కొబ్బరి క్రయవిక్రయాల్లో ఉన్న సమస్యలు, కొబ్బరి రైతుల కడగండ్లు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యాన వన పంటల అభివృద్ధిలో భాగంగా రైతులకు కొబ్బరి మొక్కలు అందించాలని కోరారు. దీనిపై పీడీ స్పందించి రైతులకు మేలుచేసే, రైతుల ఆర్థిక బలోపేతానికి పనికివచ్చే ప్రతి కార్యక్రమానికీ సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎసి రామ్మోహనరావు, సిసి రామకృష్ణ, సిబ్బంది పూడి సుహాసిని, కాయ భాగ్యవతి, పి.గీత, సుగుణ పాల్గొన్నారు.

మొగలు పువ్వుల పెంపకం పరిశీలన

ఇచ్ఛాపురం : మండలంలోని బూర్జపాడు పంచాయతీ డొంకూరు, పెద్దలక్ష్మీపురం గ్రామాల్లో మొగలి పువ్వులు తోటల పెంపకాన్ని డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, డిపిఎంఎల్‌ఎచ్ నారాయణరావు, ఎపి రామ్మోహన్, వెలుగు ఎపిఎం ప్రసాదరావులు పరిశీలించారు. మొగలి పువ్వులు సేకరిస్తున్న వ్యవసాయం చేస్తున్న బట్టిలో ఉన్న రైతులు దున్న జానకిరావు, దున్న కూర్మారావ్, దొంగ సోమయ్య, పులకల గోవిందు, ధర్మరాజు మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాబుకి తెలిసొచ్చిన మత్స్యకారుల కష్టాలు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

నాలుగు సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన చంద్రబాబు జిల్లాలోని పేదలకు ప్రత్యేకించి మత్స్యకారులకు తాను చేసిన సంక్షేమం, అభివృద్ధి ఏమిటో బుడగట్లపాలెం పర్యటనతో తెలిసిసొచ్చినట్లయింది. మత్స్యకార సేవలో పథకం కింద వేట నిషేధ సాయం అందించేందుకు జిల్లాకు వచ్చిన సిఎం వద్ద మత్స్యకారులు తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టుకున్నారు. తాను ఊహించని దానికంటే భిన్నంగా మత్స్యకారుల సమస్యలు ఉన్నాయని స్వయంగా బాబే పేర్కొనడం గమనార్హం. మత్స్యకారులతో ముఖాముఖి కోసం నేరుగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభకు రాకుండా బుడగట్లపాలం తీరంలో కొందరు మత్స్యకారులను కలిసి వారి ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నం చేశారు. దాదాపు గంట పాటు వారితో మాటామంతీ ఆడారు. వలలు, మోటార్లు అందించలేదని కొందరు, ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే చేపల వేటకు ఇబ్బంది ఉండదంటూ మరికొందరు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. ఏం చేస్తే మీ జీవితాలు బాగుపడతాయో తెలుసుకోవడానికే వచ్చానంటూ మత్స్యకారులతో అనడంతో మత్స్యకారులు ఒకరి మొఖం ఒకరు పరస్పరం చూసుకున్నారు. నాలుగు సార్లు రాష్ట్రాన్ని ఏలిన బాబుకు తమ కష్టాలు ఇప్పటివరకు తెలియలేదా? అని నిట్టూరుస్తూనే బాబు అడుగులో అడుగు వేశారు. ఇంతలో అక్కడే మరికొందరు మత్స్యకారులు బాబుకు తారసపడ్డారు. బోట్లు అద్దెకు తీసుకున్న వారికే చేపలు అమ్మడం వల్ల తమ కష్టానికి తగిన ఫలితం రావడం లేదని, ఐస్ బాక్సులు లేవని, ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తే మార్కెట్ బాగుంటుందని కొందరు మత్స్యకారులు బాబుకు మొరపెట్టుకున్నారు. అలా ముందుకు వెళ్తున్న క్రమంలో ఎండు చేపలు అమ్మే మహిళలను బాబు కలిశారు. చేపల ఎండబెట్టే విధానం, రోజు వారి ఆదాయం వివరాలను తెలుసుకున్నారు. అక్కడ నుంచి చేపల బోట్లు, మరమ్మతులు చేసే మత్స్యకారులను బాబు కలిసి వారి ఇబ్బందులనూ తెలుసుకున్నారు. మత్స్యకారులను కలిసిన తర్వాత ఇప్పటివరకు తామేమీ చేశామే బాబుకు పూర్తిగా అర్థమైనట్లు ఉంది. తాను ఊహించని దాని కంటే మత్స్యకారుల సమస్యలు భిన్నంగా ఉన్నాయంటూ మత్స్యకారుల ముఖాముఖితో బాబే స్వయంగా ప్రసంగంలో పేర్కొనడం విశేషం. ఇన్ని కష్టాలు తెలుసుకున్న చంద్రబాబు తమకు ఏదో మేలు చేసే పని చేస్తారని ఆశగా చూసిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ, సంతబొమ్మాళి మండలం భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాల పూర్తిపైనా మత్స్యకారులకు మాట ఇవ్వలేదు. నాచు పెంచితే అధిక ఆదాయం వస్తుందంటూ వారికి ఊరడింపు మాటలతో సరిపెట్టారు. ఆర్టిఫిషయల్ రీఫ్స్ (కృత్రిమ కొండలు) ఏర్పాటుతో చేపల ఉత్పత్తిని పెంచి ఆదాయం వచ్చేలా చూస్తామంటూ అరచేతిలో వైకుంఠం చూపారు.

మత్స్యకారుల ముఖాముఖిలోనూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి డొల్లతనం బయటపడ్డాయి. అదే సభలో పి4 కార్యక్రమం కింద ఎంపికైన బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖాముఖి నిర్వహించిన చంద్రబాబుకు తాను ఎప్పుడూ చెప్పే వలసల నివారణ అంతా ఉత్తిదే అని సభ సాక్షిగా తెలిసిపోయింది. చేపల వేట కోసం తన భర్త గుజరాత్‌లోని వీరావల్‌కు వలస వెళ్లారంటూ బాబు సమక్షంలోనే చెప్పడం వారికి ఉపాధి కల్పించలేని దుస్థితిలో ఇప్పటివరకు ఉన్నట్టు బాబుకు బోధ పడినట్లయింది. తప సోదరుడు, తాను మాత్రమే చేపల వేటకు వెళ్లి వచ్చిన డబ్బులతో కుటుంబంలోని ఎనిమిది మంది బతుకుతున్నామని, చాలాకష్టంగా ఉందంటూ సూరాడ అప్పన్న అనే మత్స్యకారుడు చంద్రబాబు ఎదుట గోడు వెళ్లబోసుకోవడం మత్స్యకారులో పేదరికానికి అద్దం పడుతోంది. అన్నీ విన్న బాబు ఎప్పటి మాదిరిగానే హైదరాబాద్, ఢిల్లీ దేశంలోని అన్ని ప్రాంతాల్లో జిల్లా వాసులే ఉన్నారని, వేరే ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్నారంటూ చెప్పుకొచ్చారు. జిల్లాకు మంచి నాయకత్వం ఉన్నా రాష్ట్రంలో తలసరి ఆదాయంలో శ్రీకాకుళం జిల్లా అట్టడుగున ఉందని, నాయకులకు రోషం రావాలంటూ అక్కడ ఉన్న జిల్లా నేతలకు చురకలు అంటించే ప్రయత్నం చేశారు. వెనుకబడిన సిక్కోలుపై ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న బాబు దృష్టి పెట్టకుండా జిల్లా నేతలను నిందిస్తే మాత్రం ఏం ప్రయోజనమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదే సభలో మరోసారి ఉద్యమాలపై తన అక్కసు వెళ్లగక్కారు. జిల్లా వెనుబడిపోవడంపై చాలా ఆవేదనగా ఉందంటూ సిఎం ఎదుట తెగ బాధ పడిపోయారు. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో జిల్లా అట్టడుగున ఉండటంపై సిగ్గుపడాలని ఆవేదన చెందారు. 20, 30 ఏళ్ల పాటు ఉద్యమాలు చేయడం వల్ల మంచి పేరు పోయిందని, ఏదైనా కార్యక్రమం చేద్దామంటే జెండాలు లేపుతున్నారని, అందుకే జిల్లాకు రావడానికి అంతా భయపడుతున్నారంటూ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో ఉద్యమాలపై రెండు పర్యాయాలు నోరుపారేసుకోవడం చూశాం. విమర్శలు వెల్లువెత్తుతున్నా అచ్చెన్న వైఖరి మారినట్లు కనిపించడం లేదు. తలసరి ఆదాయం, జిల్లా వెనుకబాటుపై మంత్రి అచ్చెన్నాయుడుతో సహా జిల్లా నేతలకు తరచూ ముఖ్యమంత్రి చంద్రబాబు క్లాస్ పీకుతుండటంతో ఏమీ తోచకే ఈ వ్యాఖ్యలు చేశారని అంతా అనుకుంటున్నారు. ఇదే సభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు చూపిన అత్యుత్సాహం తీవ్ర విమర్శలకు దారి తీసింది. పరిశ్రమల్లో కార్మిక సంఘాలు, సిఐటియును కంట్రోల్ చేస్తున్నానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద క్రెడిట్ కొట్టేయానికి ఆయన చాలా ప్రయాస పడ్డారు. పరిశ్రమల్లో భద్రత లేక మృత్యువాత పడుతున్న, గాయాలు పాలవుతున్న అంశాన్ని వదిలేసి కార్మికుల కోసం నిఖార్సైన పోరాటం చేస్తున్న సిఐటియుపై ఆయన తన అక్కసు వెళ్లగక్కారు. యాజమాన్యాలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసి వారిని బెదిరించి కాంట్రాక్టులు తీసుకుంటున్న అంశంపై నియోజకవర్గంలో చర్చ జరగుతున్న నేపథ్యంలో అసలు విషయాన్ని డైవర్ట్ చేసేందుకే కార్మికులపైకి నెట్టేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకో లేక తమ బాగోతం బయటపడకుండా ఉండేందుకో తెలియదు కాని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఉద్యమాలు, కార్మికులపై ఏడుపుగొట్టు ప్రసంగాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. సరియైన సమయంలో ప్రజలే వీరికి బుద్ధి చెప్పనున్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ప్రొటెక్టింగ్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్ అండ్ ఐపి మేనేజ్మెంట్ ఫర్ స్టార్టప్స్' అనే అంశంపై బిజినెస్ ఇంకుబేటర్ (ఎంఎస్ఎంఇ), ఎంబిఎ విభాగాల ఆధ్వర్యాన శనివారం అవగాహనా సదస్సు నిర్వహించామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్ నోవల్ పేటెంట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ ప్రోజెక్ట్స్ స్వామిజి పాల్గొని మేధోసంపత్తి హక్కుల పరిధిలోకి కాపీరైట్స్, ట్రేడ్మార్క్స్, ట్రేడ్ సీక్రెట్స్, పేటెంట్లు వంటి అంశాలు వస్తాయన్నారు. ఐతమ్ విద్యార్థులు రూపొందించిన 6 ఐడియాలను ఎంఎస్ఎం ఈ గుర్తించడంతో వాటి పేటెంట్లు కోసం ఎలా ధరఖాస్తు చేసుకోవాలి, రిజిస్టర్ అయితే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఎంబిఎ, బిటెక్ విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, ఎంఎస్ఎంఇ బిజినెస్ ఇంకుబేటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.విష్ణుమూర్తి పాల్గొన్నారు.


విద్యార్థిని సత్కరిస్తున్న రామారావు

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కవిటి

ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో నైపుణ్యాలు మెరుగుపడి భవిష్యత్ భారతానికి ఆశాకిరణాలుగా నిలుస్తారని వ్యాపారవేత్త, చింతామణి సొండికుల సంక్షేమ అధ్యక్షుడు రామారావు అన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించడమే కాకుండా చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన కవిటికి చెందిన పొల్లాయి ఢిల్లేశ్వరి ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు 573 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా రామారావు ఢిల్లేశ్వరిని సత్కరించి ఆమె భవిష్యత్ చదువుకు రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ప్రోత్సాహం లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థుల్లో అపార నైపుణ్యాలు దాగున్నాయని, వారిని ప్రోత్సహిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఢిల్లేశ్వరి భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలతో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాండవ చంద్రశేఖర్, పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి మోరేసు రుద్రయ్య, పొల్లాయి సింహాచలం, పొల్లాయి కృష్ణ, పొల్లాయి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుపతిరావుకి జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి- సోంపేట


తిరుపతిరావు

జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (న్యూఢిల్లీ) నిర్వహించిన గణిత ప్రాజెక్టుల సెమినార్ పరిశీలనలో కంచిలి మండలం చౌత్రాయిపురం ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయుడు, గణిత అవధాని మడ్డు తిరుపతిరావు రూపొందించిన గణిత ప్రాజెక్ట్ జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఎన్‌సిఇఆర్‌టి ఆధ్వర్యాన జనవరిలో 13వ జాతీయ గణిత విద్యా సమావేశాలు నిర్వహణ సందర్భంగా దేశవ్యాప్తంగా గణిత ప్రాజెక్టులను ఆహ్వానించారు. తిరుపతిరావు మాస్టారు తన విద్యార్థుల కోసం రూపొందించిన గణిత ప్రాథమిక కార్యకలపాల సన్నాహక దశలో, విద్యార్థుల పనితీరు అంచనా వేసేందుకు తయారు చేసిన బోర్డు గేమ్ ప్రయోగం అనే ప్రాజెక్టును పోటీలకు పంపించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించి, వచ్చిన ఫలితాలను, ప్రాజెక్టు పనితీరును ఆన్లైన్ ప్రక్రియ ద్వారా ప్రదర్శించారు. భారతదేశం వ్యాప్తంగా 105 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు ప్రాజెక్టులు మాత్రమే ఎంపిక చేశారు. మండలంలోని బూరగాంకి చెందిన తిరుపతిరావుకి జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. ఈ అవార్డు రావడంపై తోటి ఉపాధ్యాయులతో, నాయకులు అభినందనలు తెలియజేశారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన గురువులు విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టరు డిఎస్ఎన్ శాస్త్రి, ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యంగా వ్యవహరించిన భీమవరానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.మాధవకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం: ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను శనివారం నగరంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. .కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం గడచిన పన్నెండేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి లేకుండా చేశారని, రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు కట్ట బెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, నాయకులు వేణు, మధు, రమేష్, రామోజీ పాల్గొన్నారు.
నరసన్నపేట : పట్టణంలో స్థానిక సాయి రత్న ఐటిఐ వద్ద ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వసంత్, క్రాంతి, వాసు, శ్యామ్ పాల్గొన్నారు.

గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలి

టెక్కలి రూరల్ : వైసిపి పటిష్టానికి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి అంకితభావంతో పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి మండల కమిటీ నూతన కార్యవర్గ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గ్రామ కమిటీలు త్వరితగతిగా పూర్తి చేయాలని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ద్వారా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. అచ్చెన్నాయుడు నిరంకుశ పాలనపై పోరాటం సాగించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు సంపతరావు హేమసుందరరాజు, ఎంపిపి ప్రతినిధి రోణంకి మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి రామకృష్ణ, నూక సత్యరాజు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన


పొందూరు : మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శ్రీధర్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో అసంఘటిత రంగ కార్మికులకు అవసరమైన చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. అలాగే స్థానిక అంపోలు ఉన్న జిల్లా కారాగారాన్ని సందర్శించారు. జైలు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ముద్దాయిలతో ముచ్చటించి ప్రభుత్వ న్యాయవాదులను నియమించడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముందంజలో పనిచేస్తుందని, ఎవరికైనా న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, లేబర్ కమిషనర్ అజయ్ కార్తికేయ పాల్గొన్నారు.

పొందూరు: రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు కల్పించిన కార్మిక చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా శనివారం పొందూరులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్మికుడు చేసిన పనికి కనీస వేతనం పొందాలన్నారు. అలాగే పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు గాయపడినా, మృతి చెందినా ప్రభుత్వాలు ఆర్థిక ప్రయోజనాలను కల్పిస్తున్నాయని, వాటిపై కార్మికులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కార్మికులకు అమలవుతున్న చట్టాలు, హక్కులను వివరించారు. న్యాయవాదులు కె.రమణమూర్తి, అశోక్, బ్రహ్మాజీ, కిరణ్‌కుమార్, రాము, ఎపిఒ శ్రీనివాసరావు, ఎఫ్ఎ రాంబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.
టెక్కలి: ప్రతి కార్మికుడూ ఈ–శ్రమ్ కార్డు కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మల తెలిపారు. అసంఘటిత కార్మికులకు అవగాహన వారోత్సవాల్లో స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శ్రీలక్ష్మి జీడిపప్పు పరిశ్రమలో కార్మికులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్మికుడూ ఈ–శ్రమ్ పోర్టల్‌లో విధిగా నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, భీమా పొందవచ్చునని అన్నారు. న్యాయవాదుల సంఘం మండల అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పట్నాయక్, న్యాయవాదులు పొట్నూరు ఆనందరావు, పైడి సాయిరాజ్, మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఎపిఒ ప్రసాదరావు, జీడిపప్పు పరిశ్రమ యజమాని అనిల్ కుమార్, పారా లీగల్ వాలంటీర్ కొత్తూరు గోపాలకృష్ణ పాల్గొన్నారు.


శ్రీకాకుళం లీగల్ : మాట్లాడుతున్న శ్రీధర్

పలాస : కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలాస కోర్టు జడ్జి యు.మాధరి అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బికెర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబరు కోత రజనీకుమార్, శ్రీనివాసరావు, పారా లీగల్ వాలంటీర్ సునీల్, కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

కొత్తూరు: స్థానిక నేతాజీ నగర్ కాలనీ పోలా ఆదినారాయణ ఉన్న వీధిలో సిసి రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు పంచాయతీ నిధుల నుంచి ప్రొక్లెయినర్ సహాయంతో శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి టొంపల తిరుపతిరావు, లోతుగెడ్డ జనార్ధనరావు పాల్గొన్నారు.

సెలవుల్లో బదిలీలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 31 నాటికి అన్ని కేటగిరీలకు బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయడం ద్వారా జూన్ 5 నాటికి కొత్త స్కూళ్లలో చేరేందుకు వీలుంటుందన్నారు. స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేసుకునేందుకు వీలవుతుందన్నారు. ఉపాధ్యాయ బదిలీలు పనిదినాల్లో చేపట్టడం వల్ల పాఠశాలలపై దృష్టి పెట్టడానికి కొంత ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అందువల్ల వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస కాలనీ కట్యాచార్యులపేట, దండేవలస, చింతలపేట తదితర గ్రామాలకు ఎట్టకేలకు విద్యుత్ పునరుద్దరణ చేశారు. గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షానికి విద్యుత్ తీగలపై చెట్లు పడి అదే రోజు రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నారులతో ఉండలేక వారి ఆర్తనాదాలు వినలేక అసౌకర్యానికి గురయ్యామని పలువురు తెలిపారు. విద్యుత్ సిబ్బంది శనివారం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో విద్యుత్ పునరుద్ధరణ జరగడంతో ఊపిరి పీల్చుకున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కొత్తూరు : మండలంలోని మెట్టూరులో శనివారం నిర్వహించి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో టిడిపి నాయకులు గెడ్డవలస కమలాకర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 175 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దశరథరావు, బర్రి మహేష్, జి.ప్రభాకరరావు, ఆర్‌పిఎం వైద్యులు పి.కూర్మినాయుడు, ఎం.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు జి.ధర్మారావు, ఎ.పాండురంగనాథం పాల్గొన్నారు.

కాలువలను ఆక్రమిస్తే చర్యలు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాలువలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ ఎం.రామారావు హెచ్చరించారు. పురపాలక సంఘంలో రోజువారి శానిటేషన్ పర్యటన విధుల్లో భాగంగా శనివారం మొగిలిపాడు, కె.టి.రోడ్డు, ఇందిరా చౌక్, కాశీబుగ్గ బస్టాండ్ ఏరియా, మూడు రోడ్ల కూడలి, అన్న క్యాంటీన్ ఏరియా, నర్సిపురం ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. నర్సిపురం కాలనీలో కాలువలపై ఆక్రమణలు చేసి శానిటేషన్ విధులకు ఆటంకం కలిగిస్తున్నటు టుర్తించి సదరు ఆక్రమణలను తొలగించారు. ాార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్


మానవహారం నిర్వహిస్తున్న పోరాట కమిటీ సభ్యులు

ఎస్‌సి వర్గీకరణతో అన్యాయం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఎస్‌సి వర్గీకరణతో రెల్లి సామాజిక తరగతికి తీవ్ర అన్యాయం జరిగిందని రెల్లి కుల హక్కుల పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి సురేష్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని సవళాపురం జంక్షన్ నుంచి సరుబుజ్జిలి జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చి జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణతో రెల్లి ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రెల్లి, ఉప కులాలకు ఒకశాతం, ఎస్‌సి దళితుల్లో మాల సామాజిక తరగతికి 7.5 శాతం, మాదిగ సామాజిక తరగతికి 6.5 శాతం ఇచ్చి రెల్లి ఉప కులాలకు ప్రభుత్వం 'ఎ' గ్రూపుగా ప్రకటిస్తూ ఒకశాతం రిజర్వేషన్ ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. జనాభా ప్రాతిపదికన 2 లక్షల 50 వేల మంది రాష్ట్రం మొత్తం మీద రెల్లి సామాజిక తరగతులు ఉన్నారన్నారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెల్లి సామాజిక తరగతిపై దృష్టి సారించి కుల గణాంకాల ప్రకారం ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రెల్లి కులానికి ప్రభుత్వం న్యాయం చేయకుంటే ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెల్లికుల మహిళా నాయకులు బెరిసెట్టి అనురాధ, జిల్లా నాయకులు గొల్లపల్లి ఎర్రయ్య, మోహనరావు, సిరిపల్లి శ్రీనివాసరావు, వి.గోవిందరావు, ఎస్.ప్రసాదరావు, గండి విజయ్ కుమార్, గొల్లపల్లి అర్జున్, మోహనరావు, జగదీష్, సిరిపల్లి సత్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంఎల్‌హెచ్‌పిల ఆందోళన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (సిహెచ్‌ఒ)లు గత నెల 15 నుంచి ఆందోళన కొనసాగిస్తున్నారు. నిరవధిక సమ్మెలో కొనసాగుతున్న వారంతా శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ధర్నా శిబిరం వద్ద ఎపిఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నిరంజన్ మాట్లాడుతూ గడచిన రెండేళ్లుగా వైద్య సేవలు అందించడంలో ఆర్థిక, ఆర్థికేతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఏడాది మార్చి 21న కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించుకున్నా ఎటువంటి ఆమోదయోగ్యమైన సమాధానం రాలేదన్నారు. ఆయుస్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌చార్జ్ ప్రకటించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీతో పాటు ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేసియా, పితృత్వ సెలవులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సందీప్ కుమార్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్, ఇతర నాయులు మమత, సిహెచ్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలు

కమిషనర్ ఎండార్స్‌మెంట్ ఉత్తర్వులు సస్పెన్షన్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వైస్ ఛైర్పర్సన్, వార్డు కౌన్సిలర్ లాభాల స్వర్ణమణి అనర్హతపై కమిషనర్ ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌పై హైకోర్టు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో టేబుల్ ఎజెండాలోని తీర్మానం నంబరు 472 ద్వారా తనను వార్డు మెంబరు, వైస్ చైర్‌పర్సన్ పదవికి అనర్హులుగా టిడిపి కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ... తీర్మానం ఆమోదించారని అన్నారు. దీనిపై వివరణ కోరగా, సభ్యత్వం రద్దయిందని జవాబు ఇచ్చారని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించ... మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు విన్నాదని అనానరు. కమిసనర్ జారీ చేసిన ఎండార్స్‌మెంట్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ... తన అనర్హత విషయంలో జిల్లా జడ్జి తీర్పు వచ్చే వరకు కొనసాగించాలని గతనెల 30న తీర్పునిచ్చిందన్నారు. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడానికి అన్ని విధాలుగా సహకరించిన ఇచ్ఛాపురానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ ఎన్.విశ్వనాథంకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

లావేరు: చిన్నారులు సెల్‌ఫోన్లుకు దూరంగా ఉండాలని రిసోర్స్‌పర్సన్ పి.పద్మావతి అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు సెల్‌ఫోన్, వాటిపై చెడు ప్రభావాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ప్రాథమిక, హైస్కూల్ చదువుతున్న విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. గ్రంథాలయంలో ఉండే బాల సాహిత్యం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు ప్రతి విద్యార్థి చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపడం నేరం

పొందూరు: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలం లైదాంలో శనివారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం, మత్తుపదార్ధాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత బానిస కావడం ద్వారా తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల రోజువారి కార్యకలాపాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సైన్సు కోర్సులపై శిక్షణ

శ్రీకాకుళం: పిజి సెట్ ద్వారా సైన్సు కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఆయా కోర్సులపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్, ఇండియన్ సొసైటీ ఫర్ ఫ్రుగల్ సైన్స్ ఇన్నోవేషన్స్ సంయుక్తంగా 15 రోజుల ఓరియంటేషన్ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు ప్రారంభించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో శనివారం నుంచి ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళంలో వైద్య సౌకర్యాల మెరుగు, వ్యాధుల నిర్ధారణ, నివారణ, చికిత్స రంగాలకు సంబంధించిన సాంకేతిక వినియోగంలో ఉపాధి అవకాశాలు పొందడానికి ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా వైద్య రంగాల్లో ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వివిధ కోర్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్సెస్ విద్యా సంవత్సరం 2024–25 నుంచి రెండేళ్ల ఎంఎస్‌సిలో మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రాంను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. వివిధ ప్రైవేట్ ఆస్పత్రులతో అవగాహన ఒప్పందంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అప్లైడ్ సైన్సెస్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.ప్రదీప్, డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణి హాజరై కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే వారు కళాశాల బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌ను, 8555911961, 6301096643, 7702203953 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వృద్ధులకు అన్నదానం

శ్రీకాకుళం రూరల్: అన్నం పరబ్రహ్మ స్వరూపమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ పట్నాయక్ అన్నారు. నైట్‌షెల్టర్‌లో ఉండే నిస్సహాయ, వృద్ధులకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో క్లబ్‌సభ్యులు, మదర్స్ హెల్పింగ్ సొసైటీ డా.పైడి ప్రదీప్ జన్మదినం సందర్భంగా దుస్తులతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డిసి బడాన దేవభూషణ్ సూచనల మేరకు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి డా.పైడి. సింధూర, కోశాధికారి జోగి భారతి, పూర్వపు కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్‌తో పాటు ఇతర సభ్యులు ప్రదీప్‌కు అభినందనలు తెలిపారు.

పోరాట నాయకునికి తుది వీడ్కోలు

ప్రజాశక్తి- బూర్జ


నాయకమ్మ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళ్లర్పిస్తున్న నాయకులు

మండలంలో సిపిఎం బూర్జ శాఖా కార్యదర్శిగా, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడుగా పని చేసిన సర్దార్ నాయకమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జి.సింహాచలం, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కోశాధికారి అల్లు సత్య నారాయణ, బూర్జ మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంఠ అప్పలనాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు వి.ప్రసాద్, బిఎస్ రాజు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1994లో వ్యవసాయ కూలీల రేట్లు పెంచాలని కూలీలకు బతుకు భారం అవుతుందని 13 రోజులు పాటు ధర్నా చేసి కూలీల రేట్లు పెరిగేందుకు ఎంతో కృషి చేశారని, అలాగే 30 ఏళ్ల పాటు డైలీ కళాసీల సంఘం అధ్యక్షుడిగా సేవలందించి ఎన్నో పోరాటాలు చేసి బూర్జ మండల ప్రజలకు అనేక సేవలందించారన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పార్టీ సమావేశంతో పాటు బూర్జ అంబేద్కర్ జంక్షన్ వద్ద మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారన్నారు. ఆయన కుటుంబానికి పలువురు రాజకీయ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పాతపట్నం : రైల్వే స్టేషన్ సమీపంలో పాతపట్నం పట్టణానికి చెందిన బోయిన కామేశ్వరరావు (62) శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు కొన్నేళ్ల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు బాగోగులు పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురై గుణుపూరు–పూరీ వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలాస జిఆర్‌పి ఎస్ఐ కె.షరీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ మాజీ చైర్మన్ మృతి


ఈశ్వరరావు (ఫైల్)

పాతపట్నం : పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయన హయాంలో పాతపట్నం అమ్మవారు ఆలయానికి విశేష సేవలు అందించారని, ఆయన మృతి బాధాకరమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇఒ వాసుదేవరావు, ఆలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాకుళం: నగరంలోని గుడివీధిలో నివాసముంటున్న బాబ్జీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి ఆయనే ఆధారం. ఆయన మృతితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి ఆల్‌ఆంధ్ర టాటా మేజిక్ ఫ్రెండ్స్ అండగా నిలిచారు. నగరంలోని గుడివీధిలో నివాసముంటున్న బాబ్జీ కుటుంబాన్ని వివిధ పట్టణాల నుంచి వచ్చిన మేజిక్ డ్రైవర్లు పరామర్శించారు. ఆర్‌టిఒ పి.వి.గురునాధరావు చేతులమీదుగా రూ.1,18,166 ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఒ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి అండగా నిలిచి ఆదు కోవడం గొప్ప విషయమన్నారు. ఆల్ ఆంధ్రా టాటా మేజిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొయ్యలగూడెం సత్యనారాయణ, శ్రీకాకుళం సురేష్, అనకాపల్లి వరప్రసాద్, పెద్దాపురం సురేష్, రాజాం కిరణ్, పార్వతీపురం బాలకృష్ణ, సోంపేట పండు, మానాపురం శ్రీను, టెక్కలి రాంబాబు, గాజువాక మల్లేసు, పాత గాజువాక శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం

పలాస: రానున్న సంస్థాగత ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని నియోజకవర్గ టిడిపి ఎన్నికల పరిశీలకులు చౌదరి బాబ్జి, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గ్రామస్థాయి, నియోజక వర్గస్థాయి నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. టిడిపి బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వర రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణా రావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, ఎం.నరేంద్ర చిన్ని, కుత్తుం లక్ష్మణకమార్, చంద్రశేఖర్ త్యాడి పాల్గొన్నారు.

గంధపు చెట్లు మాయం


శ్రీకాకుళం: నగరంలోని జామియా మసీదులో నాలుగు గంధపు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. మసీదు పెద్దలు వీటిని శనివారం గుర్తించి వక్ఫ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ జామియా మసీదును సందర్శించి అటవీశాఖ అధికారులకు, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు అటవీ శాఖ అధికారులు వీటిని పరిశీలించి వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని అంచనా వేశారు.

'ఆపరేషన్ కగార్' ఎందుకు?

మందస: ప్రజా ఉద్యమాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ పోరాటంలో అడవిని నమ్ముకున్న ఆది వాసీలు కూడా ఉన్నారని మర్చిపోతే ఎలా ఆర్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రజల తరుపున పోరాడుతున్న ప్రజా విప్లవకారులకి మావోయిస్టులని ముద్ర వేసి ఆపరేషన్ కగార్ పేరుతో 600 మంది అమాయక ఆదివాసీలని పొట్టన పెట్టికుంటున్న కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి పున్ణపరిశీలించాలని డిమాండ్ చేశారు.

తాళ్లవలసలో సమస్యలు తిష్ట

- వృథాగా పోతున్న తాగునీరు
- మరమ్మతులు నోచుకోని కుళాయిలు
- గ్రామంలో అపారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు


అపారిశుధ్యంగా వీధి కాలువ


ముప్పిడివీధిలో వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్ల వలస పంచాయతీ సమస్యలతో సతమతమవుతుంది. గ్రామంలో తాగునీటి కుళాయిల టాప్‌లు విరిగిపోవడంతో గత 15 రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో గ్రామంలోని అన్ని వీధుల్లో పూడికలు పేరుకుపోయి అపారిశుధ్యం తాండవిస్తుంది. దీంతో మురుగు కాలువల్లో మురుగునీరుతో పూడికలు కాలువలు నిండుగా పేరుకుపోవడంతో దుర్గంధపు వాసనతో దోమలు, ఈగలతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దళితవాడ, ముప్పిడివీధుల్లో తాగునీరు కుళాయిల ట్యాప్‌లు విరిగిపోవడంతో గత పదిహేను రోజులుగా తాగునీరు వృధాగా పోతుంది. ఈ విషయంపై సర్పంచ్, కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వేసవిలో దాహార్తిని తీర్చేందేకు తాగునీరు వృథాగా పోకుండా కుళాయిలకు మరమ్మతులు చేసి నూతన ట్యాప్‌లు ఏర్పాటు చేసి గ్రామస్తుల దాహార్తిని తీర్చేలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి వీధుల్లోను, కాలువల్లో పూడికలు తొలగించి దోమలు, ఈగలు, దుర్గంధపు వాసనలు నుంచి తమకు విముక్తి కలిగించేందుకు జిల్లా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మీనాక్షి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి- శ్రీకాకుళం


మాట్లాడుతున్న గంగాధరరావు

నగరంలోని మీనాక్షి ఆస్పత్రిలో అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధరరావు విజయవంతంగా నిర్వహించారు. ఏప్రిల్ 22న 18ఏళ్ల యువకుడు స్నేహితులతో సరదాగా బాణాసంచి స్టీల్ గ్లాస్‌లో పెట్టి పేల్చగా, స్టీల్ గ్లాస్ ముక్క ఒకటి యువకుడు పొట్ట భాగంలో కోసుకుందని, ముందుగా సమీపంలోని క్లినిక్‌లో కుట్లు వేసుకున్నాడు. అయితే కడుపునొప్పి, కడుపు పొంగు ఎక్కువ అవ్వటంతో యువకుడు అదేరోజు సాయంత్రం మీనాక్షి ఆస్పత్రిని సంప్రదించాడు. ఆస్పత్రికి వచ్చినప్పుడు బిపి చాలా తక్కువగా ఉండి, రక్తహీనత గమనించి, టెస్టులు చేయగా పెద్దపేగులో మెటల్ ఆబ్జెక్ట్ (స్టీల్ గ్లాస్ ముక్క) ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపారు. వెంటనే ఎమర్జెన్సీ సర్జరీ చేపట్టగా, స్టీల్‌గ్లాస్ ముక్క పెద్ద ప్రేగుని అనేక చోట్ల చీల్చి సుమారు 3.5 లీటర్ల రక్తస్రావానికి కారణమైనట్టు తేలింది. తక్షణమే స్టీల్‌గ్లాస్ ముక్కను తొలగించడంతో పాటు, రక్తస్రావాన్ని నియంత్రించి, పెద్దపేగును తొలగించకుండా కుట్లు వేసి సంరక్షించి, ఆపరేషన్ విజయవంతంగా ముగించినట్టు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆరు ప్యాకెట్ల రక్తం ఎక్కించి సమయానికి ఎమర్జెన్సీ సర్జరీ చేయటంతో ప్రాణాలు కాపాడగలిగామన్నారు. అలాగే పేగుని తొలగించకుండా సంరక్షించడం వలన (ఆర్గాన్ ప్రీజర్వింగ్ సర్జరీ) ఆయనకు భవిష్యత్‌లో ఎటువంటి దీర్ఘకాలిక సమస్యలు ఉండవన్నారు. ఈ ఆపరేషనకు మత్తు డాక్టర్ ప్రసాద్, మీనాక్షి, ఆస్పత్రి నర్సింగ్, ఇతర సిబ్బంది సహకారం అందించారని తెలిపారు.